క్లుప్తంగా

ప్రతిపాదనలు సిద్ధం చేయండి


పంచాయతీరాజ్ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

దమ్మపేట: మండల పరిధిలో రహదారులు అవసరమైన ప్రాంతాలను గుర్తించి, వాటి నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ అధికారులకు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం మండలంలోని గండుగులపల్లి నివాసంలో మంత్రి తుమ్మలను, పలు శాఖల అధికారులు, స్థానిక నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల పంచాయతీరాజ్ అధికారులతో మాట్లాడుతూ.. మండలంలోని శ్రీరాంపురం నుంచి రెడ్యాలపాడు, మల్కారం నుంచి అశ్వారావుపేట మండల పరిధిలోని ఉసిర్లగూడెం వరకు బీటీ రోడ్లు నిర్మించడానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అశ్వారావుపేట మండలానికి సరిహద్దులోనున్న గుబ్బల మంగమ్మ ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సీఐ కరుణాకర్‌కు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, డీఈ శ్రీధర్, సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, కాంగ్రెస్ నాయకులు కేవీ సత్యనారాయణ, కొయ్యల అచ్యుతరావు, దొడ్డా ప్రసాద్, మన్నెం అప్పారావు, ఎల్లిన మురళీ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ సరికాదు

దమ్మపేట: విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించాలని ప్రయత్నిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరు సరికాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ అన్నారు. మంగళవారం విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిట్టల అర్జున్ మాట్లాడుతూ.. విద్యుత్ శాఖను ప్రైవేటీకరించే దిశగా కేంద్రం ప్రయత్నిస్తే, విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు, బాసటగా నిలిచి పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రాష్ట్రంలో కూడా విద్యుత్ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఈశ్వరమ్మ, సత్యవతి, కుమారి, జయ, నాగమణి, బుల్లెమ్మ, శ్రీలత పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

మణుగూరుటౌన్: యువతకు క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం పట్టణంలోని కమలాపురం యూత్ ఆధ్వర్యంలో నిర్వహించి మెగా క్రికెట్ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఫైనల్స్‌లో సమితిసింగారం మ్యాగీలెవన్-కమలాపురం కింగ్స్ లెవన్ తలపడగా, గెలుపొందిన మ్యాగిలెవన్ జట్టుకు రూ.20వేల ప్రైజ్‌మనీతో పాటు రన్నర్ జట్టుకి రూ.12వేల ప్రైజ్‌మనీతో పాటు షీల్డ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేను ఘనంగా శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు, కమలాపురం గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మొదలైన నూతనోత్సాహం..

- కేక్‌లు, రంగుల దుకాణాల వద్ద సందడి
- దీపాలంకరణలతో చర్చిలు, దేవాలయాలు
- పలుచోట్ల ముందస్తు వేడుకలు షురూ..


దమ్మపేటలో దుకాణాల వద్ద రంగులను కొనుగోలు చేస్తున్న ప్రజలు


కరకగూడెం: కేక్ కట్ చేస్తున్న ఆర్‌ఎంపీలు


మణుగూరుటౌన్ పట్టణంలో ఏర్పాటు చేసిన బిర్యానీ స్టాళ్లు



ములకలపల్లిలో ఇంటి ముంగిట రంగవల్లి

దమ్మపేట: మండల కేంద్రంలో నూతన సంవత్సర వేడుకల సందడి మొదలైంది. మంగళవారం దమ్మపేట ప్రధాన సెంటర్‌కు ఇరువైపులా రంగులు, స్వీట్లు, బిర్యాని అమ్మే దుకాణాలు వెలిశాయి. దీనితో జన సమూహాలతో ప్రధాన సెంటర్ అంతా రద్దీగా మారింది. స్థానిక మహిళలు, యువతులు నూతన సంవత్సర వేడుకలకు సిద్ధమై, ఇంటి ముందర ప్రాంగణంలో ముగ్గులు వేయడానికి, దుకాణాల వద్దకు వెళ్లి రకరకాల రంగులు, వేడుకల కోసం స్వీట్లు, తినుబండారాల కొనుగోలు ప్రారంభించారు. రాత్రి వేడుకలకు అవసరమైన సరంజామాను, యువకులు సిద్ధం చేసుకున్నారు.

కరకగూడెం: మండల వ్యాప్తంగా మంగళవారం ముందస్తుగా నూతన సంవత్సర వేడుకలను మండల వాసులు ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని దుకాణాల్లో ప్రజలు రంగులు, కేకులు, దుస్తులు, రకరకాల వస్తువులు కొనడంతో సందడి వాతావరణం నెలకొంది. పలు చోట్ల యువత అర్ధరాత్రి కేకులు కేకులు కట్ చేస్తూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. రాళ్ల వాగు వద్ద జరిగిన ఆర్‌ఎంపీల సమావేశం అనంతరం నూతన సంవత్సర సందర్భంగా కేక్ కట్ చేసి సందడి చేశారు.

మణుగూరుటౌన్: పట్టణంలో ఆంగ్లనూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు సర్వత్రా సిద్ధమయ్యారు. పట్టణంలో ప్రత్యేక ఆఫర్లతో అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునేలా వ్యాపారులు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు. బిర్యానీ, రంగుల స్టాల్స్, బేకరీల వద్ద కేకుల స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయాలు జరుగుతుండగా, పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో మణుగూరు సీఐ సతీష్‌కుమార్ మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావొద్దంటూ జాగ్రత్తలతో కూడిన ఫ్లెక్సీలను మణుగూరు జన సంచారం అధికంగా ఉండే అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఉంచారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ముస్తాబు చేయగా.. దేవాలయాలు ఆంగ్ల సంవత్సరం పూజలకు భక్తుల రాక కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


అశ్వాపురం: ఎక్స్‌లెంట్ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు


మణుగూరుటౌన్: పీవీకాలనీలో ముస్తాబైన సెయింట్ పాల్ ట్రినిటి చర్చ్..

ప్రజారక్షణే ధ్యేయంగా పని చేయాలి


కేసుల వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరురూరల్: ప్రజారక్షణే ధ్యేయంగా ప్రతీ పోలీస్ పని చేయాలని మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన మణుగూరు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి తనిఖీ చేశారు. తొలుత పోలీస్‌స్టేషన్ సందర్శనకు విచ్చేసిన డీఎస్పీ రవీందర్‌రెడ్డికి సీఐ ఎస్.సతీష్‌కుమార్ మొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్‌సిబ్బంది నుంచి డీఎస్పీ గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం సిబ్బంది దుస్తులు, వస్తు సామగ్రిని పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులు వివరాలు, నేరాల విషయంలో పురోగతి వివరాలను సీఐని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులపై మర్యాదగా నడుచుకోవాలని, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. గంజాయి, గుట్కా, నాటుసారా రవాణా, క్రయవిక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక దృష్టి సారించి, పకడ్బందీగా నిఘా ఏర్పాటు చేయాలని, వాటి నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ సతీష్‌కుమార్, ఎస్సైలు మేడ ప్రసాద్, రంజిత్, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్వే పరిశీలన

అశ్వారావుపేటరూరల్: గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే కార్యక్రమాన్ని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. మంగళవారం మండలంలోని నందిపాడు, నారాయణపురం, ఊట్లపల్లి గ్రామ పంచాయతీల్లో పర్యటించి, ఆయా పంచాయతీల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. అనంతరం సర్వేలో నమోదు చేస్తున్న వివరాలు పరిశీలించి, యాప్‌లో సాంకేతిక సమస్యల కారణంగా లబ్ధిదారుల పేర్లు రాకపోతే ఆయా లబ్ధిదారుల పేర్లను ప్రత్యేకంగా నమోదు చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు అలివేలు, మహేశ్వరి, సిబ్బంది ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి

అశ్వారావుపేటరూరల్: మున్నూరు కాపు కుల ధ్రువీకరణ పత్రాలను సకాలంలో ఇవ్వాలని కోరుతూ ఆ సంఘం బాధ్యులు మంగళ వారం స్థానిక తహసీల్దార్ కృష్ణ ప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందించారు. తహసీల్దార్ తనవంతు సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. సంఘం అధ్యక్షుడు కె.నాగబాబు, బాధ్యులు యూఎస్ ప్రకాశ్‌రావు, తాడేపల్లి రవి, కట్టా శ్రీను, చిట్టి నాగేంద్రరావు, చిక్కం గోపాలకృష్ణ, రామారావు, వెంకట రమణ, టి.అప్పారావు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో జరుపుకోవాలి

మణుగూరురూరల్: ఆనందోత్సాహాలతో న్యూఇయర్ వేడుకలను జరుపుకోవాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రజలకు సూచించారు. మంగళవారం సోషల్ మీడియా వేదికగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక నియోజకవర్గ ప్రజలందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని భగవంతుడి ప్రార్థించారు.

ఏరియాలో 107 శాతం బొగ్గు ఉత్పత్తి



వివరాలు వెల్లడిస్తున్న జీఎం రాంచందర్

మణుగూరుటౌన్: డిసెంబర్ మాసంలో మణుగూరు ఏరియాకు సంబంధించి 107 శాతం బొగ్గు ఉత్పత్తి నమోదైందని జీఎం దుర్గం రాంచందర్ తెలిపారు. అలాగే, ఓబీ వెలికితీత లక్ష్యం 91 శాతం సాధించామని వెల్లడించారు. జీఎం కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెలలో 11.58 లక్షల టన్నులకు 12.39 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి నమోదైందన్నారు. ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు రైలు, రోడ్డు, రోప్ మార్గాల్లో 10.81 లక్షల టన్నుల బొగ్గు తరలించామని తెలిపారు. కాగా, ఉత్పత్తి లక్ష్య సాధనకు కార్మికుల పనివేళల్లో మార్పునకు కసరత్తు జరుగుతోందని జీఎం చెప్పారు. ఇది అమలైతే మొదటి షిఫ్ట్ ఉదయం 5నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9 వరకు, మూడో షిఫ్ట్ రాత్రి 9నుంచి ఉదయం 5గంటలకు ఉంటుందని తెలిపారు. సమావేశంలో అధికారులు శ్యాంసుందర్, లక్ష్మీపతిగౌడ్, వెంకట్రావు, శ్రీనివాస్, సలగల రమేశ్, శేషగిరి, అనురాధ, కట్ల శ్రీనివాస్, సింగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపులు ఐక్యంగా ఉండాలి


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న కొత్వాల, కమటం, నాయకులు

అశ్వాపురం: మున్నూరుకాపులు ఐక్యంగా ముందుకు సాగుతూ అన్ని రంగాల్లో రాణించాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడు కమటం వెంకటేశ్వరరావు నివాసంలో మంగళ వారం సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో మున్నూరుకాపులు అన్ని రంగాలలో రాణిస్తూ మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సంఘం అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కమటం వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు ఆసా శ్రీనివాసరావు, యువజన సంఘం అధ్యక్షుడు పర్వత నరేష్, మాజీ జెడ్పీటీసీ ఎర్రంశెట్టి ముత్తయ్య, మాజీ ఎంపీటీసీ కమటం నరేష్, నాయకులు కాసరబాద రాములు, కోలా నాగేశ్వరరావు, పులి సత్యనారాయణ, తోట శ్రీనివాసరావు, కమటం సురేష్, ఆవుల రవి, నల్లపాటి సత్యనారాయణ, మండల కార్యవర్గ సభ్యులు, గ్రామ కమిటీల సభ్యులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చర్ల: మండలంలోని రాళ్లగూడెంలో రోడ్డు దాటుతుండగా ఓ యువకుడిని బైక్ ఢీకొట్టగా అతడితో పాటు ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులుగాయపడిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. భద్రాచలానికి చెందిన కారం జయప్రకాష్, దేవరాపల్లికి చెందిన మరో యువకుడితో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రాళ్లగూడెనికి చెందిన బండి భిక్షం అనే యువకుడిని ఢీకొట్టారు. దీంతో బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని సైతం ఢీకొట్టారు. ముగ్గురినీ భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

అశ్వాపురం: నూతన సంవత్సరం వేడుకల నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా మండల వ్యాప్తంగా సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు.

కుట్టుమిషన్ల మాయంపై ఇంటెలిజెన్స్ విచారణ

అశ్వారావుపేటరూరల్: నిరుపేద మైనార్టీ మహిళలకు అందాల్సిన కుట్టుమిషన్లు మాయమైన ఘటన రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ విషయమై 'సాక్షి'లో కథనం రాగా.. సోమవారం అధికారులు వివరాలు ఆరా తీశారు. ఇక మంగళవారం అశ్వారావుపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటలిజెన్స్ అధికారులు సైతం రహస్యంగా విచారణ చేపట్టినట్లు తెలిసింది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు మంజూరైన 83 మిషన్లను ఎంపీడీఓ కార్యాలయంలోని మాజీ ఎంపీపీ గదిలో భద్రపరిస్తే 19 మిషన్లుతోపాటు 49 మోటర్లు, 14 ఐరన్ స్టాండ్‌లు, 17 బల్లలు కానరాకుండా పోయాయి.

వీటి విలువ రూ.2.50లక్షల మేర ఉంటుందని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ ఇప్పటికే ఫిర్యాదు చేయడంతో ఎస్సై టి.యయాతిరాజు విచారణ జరిపారు. ఇప్పుడు ఇంటలిజెన్స్ అధికారులు రంగంలోకి దిగగా చోరీ ఘటనపై తనకు ముందే సమాచారం ఎందుకు ఇవ్వలేదని మాజీ ప్రజాప్రతినిధి అధికారిని ప్రశ్నించినట్లు తెలిసింది.

మత్స్యావతారంలో రామయ్య


మత్స్యావతారంలో పర్ణశాల రామయ్య

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలను అర్చకులు నిర్వహించారు. అనంతరం అధ్యయనోత్సవాల్లో భాగంగా మొదటి రోజు పర్ణశాల రామయ్యను ఆలయ అర్చకులు మత్స్యావతారంలో అలంకరించారు.శ్రీ మహావిష్ణువు ధరించిన అవతారాల వరుసలో మొట్టమొదటి అవతారం మత్స్యావతారం. ఈ అవతారానికి సంబంధించి రెండు గాథలు పురాణాలలో ఉన్నాయి. ఒకటి జ్ఞాననిధులైన వేదాలను బ్రహ్మ నుంచి అపహరించి సముద్రంలో దాగిఉన్న సోమకాసురుని సహకరించడానికై మత్స్యావతారం ధరించి వేదాలను ఉద్దరించాడు. రెండవది జలప్రళయం నుంచి నావలో ఉన్న వైవస్వత మనువును సప్త ఋషులను సృష్టికి అవసరమైన విత్తనాలను ఔషధులను రక్షించాడు. అయితే, ఈ అవతారాన్ని పూజించడం వల్ల కేతుగ్రహ బాధలు తొలగుతాయని పురాణాలు వివరిస్తున్నాయని అర్చకులు వివరించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా భారతి చేత శ్రీరామజననం హరికథను భక్తులకు వినిపించారు. అనంతరం సాయంత్రం స్వచ్ఛంద సేవకులచేత కోలాటం ఏర్పాటు చేసి, వేదమంత్రోచ్చరణల మధ్య పురవీధుల గుండా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, భార్గవాచార్యులు, వేద పండితులు మల్లూరు రవికుమార్ శర్మ,నాలదీగల నరసింహాచార్యులు, వెంకటాచార్యులు, భరద్వాజచార్యులు, ఆలయ సిబ్బంది శివ, రాము తదితరులు పాల్గొన్నారు.